టాటా జయంతి సందర్భంగా వ్యాసరచన పోటీలు

బర్కత్‌పుర, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నగరంలోని వివిధ కళాశాలలో, యూనివర్సిటీలలో ఎంబీఏ చదువుతున్న విద్యార్థులచే తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ భాషలలో వ్యాసరచన పోటీను రతన్ టాటా జయంతిని పురస్కరించుకుని సరోజినినాయుడు వనిత మహావిద్యాలయం ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎంబీఏ బ్లాక్‌లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు. టాటా రతన్ విజనరీ లీడర్ షిపింగ్ అంశంపై ఈనెల 28వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు అబిడ్స్‌లోని తెలంగాణ సరస్వత పరిషత్‌హాల్‌లో రతన్ టాటా జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

బీజేపీ శాస్త్రీనగర్ పోలింగ్‌బూత్ కమిటీ నియామకం

గోల్నాక, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా గోల్నాక డివిజన్ శాస్త్రీనగర్ (పోలింగ్ బూత్ నెం.187) పోలింగ్ బూత్ కమిటీ నియామకం జరిగింది. డివిజన్ పార్టీ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి ఏడెల్లి అజయ్‌కుమార్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్‌లు హాజరై బూత్ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బూత్ కమిటీ నూతన అధ్యక్షుడుగా కె.ఎల్.సూర్యనారాయణ, కార్యదర్శిగా టి.శివకుమార్, ప్రముఖ్‌గా జి.రాజు, మన్ కీ బాత్ ప్రముఖ్‌గా కె.నిఖిల్, వాట్సాప్ గ్రూప్ ప్రముఖ్‌గా జి.శ్రావణ్, బిఎల్ఎ టు గా వినోద్‌కుమార్, సభ్యులుగా పి.సతీష్‌కుమార్, జి.వెంకటేష్, పి.ప్రకాష్, కె.పద్మ, ఈ.శోభ, పి.పల్లబాయ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అజయ్‌కుమార్, రవీందర్‌గౌడ్‌లు శాలువలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆర్.వి.ఎల్. రమేష్, నాయకులు తోట కృష్ణ పాల్గొన్నారు.


అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఎంసీ ఖాదర్ మొహినుద్దీన్

డబుల్ ఓట్ల తొలగింపునకు స్పెషల్ డ్రైవ్

రాంనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో డబుల్ ఓట్ల ఏరివేత కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టామని డీఎంసీ ఖాదర్ మొహినుద్దీన్ తెలిపారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గతంలో 25 వేల డబుల్ ఓట్లు ఉండేవని వాటిపై పొలిటికల్ పార్టీలు, ఇతరుల నుంచి ఫిర్యాదుల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. ప్రస్తుతం ఆ సంఖ్యను 9 వేలకు తగ్గించామన్నారు. సర్కిల్ పరిధిలో నేటి వరకు మొత్తం 3,08,907 ఉన్నాయని వీటిలో పురుషుల ఓట్లు 1,57,900, స్త్రీల ఓట్లు 1,50,881 ఇతరులు 13 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు 113 మంది దరఖాస్తు చేసుకున్నార, వారి ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించామన్నారు. సర్కిల్‌లో 274 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ గుప్తాతోపాటు జీహెచ్ఎంసీ అధికారులు, ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు.


క్రిస్మస్ వేడుకల్లో డాక్టర్ హేమలత

ప్రభుత్వ ఆస్పత్రిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ముషీరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆసుపత్రి క్లస్టర్ డాక్టర్ హేమలత క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రి పీహెచ్ఎన్ ఫెలీస్, ఏఎన్ఎంలు విజయకుమారి, సునీత, పద్మలత, ఫార్మాసిస్ట్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


ముషీరాబాద్ నుంచి ర్యాలీగా తరలివెళ్తున్న శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశ్

అదానీని అరెస్టు చేయాలి

ముషీరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ అండతో దేశవ్యాప్తంగా దోచుకుంటున్న అదానీపై విమర్శలు వస్తున్నా ప్రధాని ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ముషీరాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. బుధవారం పార్టీ అధిష్ఠానం పిలుపుమేరకు నెక్లస్‌రోడ్‌ను రాజ్‌భవన్ వరకు నిర్వహించిన ర్యాలీకి పెండం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పార్టీ నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పెండం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. అదానీ అవినీతికి పాల్పడుతూ ప్రజల సొమ్మును దోచుకుంటున్నాడని, అందుకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నదని ఆరోపించారు. అందువల్లే అదానీపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ పార్లమెంటు సమావేశాలలో పలుమార్లు అదానీ అంశంపై మాట్లాడినా చర్చకు అనుమతివ్వడం లేదన్నారు. కార్యక్రమంలో డి.వెంకటేష్, నాయకులు మారిశెట్టి నర్సింగ్‌రావు, నికోలస్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో న్యాయ విద్యార్థుల సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

రాంనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, రాజ్యాంగ విలువలను, లౌకికతత్వాన్ని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. యువ ప్రతిభను పెంపొందించాలని, న్యాయ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఉభయ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 21న పౌర సమాజం రాజ్యాంగం - న్యాయ విద్యార్థుల పాత్ర అనే అంశంపై న్యాయ విద్యార్థుల రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎల్‌యు జాతీయ కౌన్సిల్ మెంబర్ సి.రామచంద్రారెడ్డి, ఎల్ఎస్ఎఫ్ఐ నాయకులు క్రాంతి, రవితేజ, అనిల్‌కుమార్, అశోక్‌కుమార్, హుస్సేన్, వంశీ, సాయినాథ్, ముస్తాఫా, సాయితేజ, ఆలిజాన్, తహీద్ తదితరులు పాల్గొన్నారు.

రైలులో బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్ల చోరీ

బర్కత్‌పుర, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒకే రైలులోని రెండు బోగిలలో ప్రయాణం చేస్తున్న ఇద్దరు ప్రయాణికుల బంగారు నగలు సెల్‌ఫోన్లలను దొంగలు చోరీ చేశారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేటకు చెందిన దినేష్ కుమార్ జైన్ అహ్మదాబాద్ కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తున్నారు. ఈ క్రమంలో అతడి బ్యాగులో ఉన్న 11 గ్రాముల బంగారు నగలు దొంగలు తస్కరించారు. మరో సంఘటనలో నాచారానికి చెందిన శివాజీ అహ్మదాబాద్ కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైల్లో నగరానికి వస్తున్నాడు. అతడి బ్యాగులో ఉన్న 35 గ్రాముల బంగారు నగలు, రెండు సెల్‌ఫోన్లు దొంగలు చోరీ చేశారు. రెండు సంఘటనపై బుధవారం రాత్రి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

నెల రోజులుగా తొలగించని మట్టికుప్పలు

- వెలువడుతున్న తీవ్ర దుర్వాసన
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు


జనప్రియ అపార్ట్‌మెంట్ వద్ద వేసిన నాలా మట్టి

రాంనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ నాలాలో మట్టిని తొలగించిన జీహెచ్ఎంసీ సిబ్బంది మెయిన్ రోడ్డుపై జనావాసాల సమీపంలో వేశారు. నాలా నుంచి తొలగించిన వ్యర్థాలు రోడ్డు పక్కన వేసి నెల రోజులు కావస్తోంది. కానీ ఆ మట్టిని నేటికీ తొలగించలేదు. నాలా మట్టి నుంచి తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది. ఆ ప్రాంతం నుంచి పాదచారులు, వాహనదారులు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాంనగర్ నాలాలో పూడికతీత పనులను లక్ష్మణ్ అనే కాంట్రాక్టర్‌కు జీహెచ్ఎంసీ అప్పగించింది. అతను నాలాలో పేరుకుపోయిన మట్టిని తొలగించి రోడ్డుపై, జనప్రియ అపార్ట్‌మెంట్ వద్ద బ్రిడ్జిపై వేశారు. అయితే ఆ మట్టిని వారం, పది రోజుల్లో తొలగించాల్సి ఉంటుంది. కానీ నెల రోజులైనా తొలగించ లేదు. రోడ్డు పక్కన మట్టి కారణంగా వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయంపై స్థానికులు సంబంధిత కాంట్రాక్టర్, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి వెంటనే మట్టిని తొలగించాలని కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బంది



జనప్రియ అపార్ట్‌మెంట్ మెయిన్ రోడ్డుపై పోసిన నాలా పూడికతీత మట్టిని నెలరోజులైన తొలగించకపోవడంతో తీవ్ర దుర్వాసన వెలువడుతోంది. పైగా ఈ ప్రాంతం నుంచి రాకపోకలు ఆగించే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ దుర్వాసనతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

- సంగం బాల్‌రాజ్, స్థానికుడు

రాంకీ నుంచి క్లియరెన్స్ రాకపోవడంతోనే..

రాంనగర్ నాలా నుంచి తీసిన పూడిక మట్టిని జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించడం జరుగుతుంది. అయితే రాంకీ కొద్ది రోజులుగా పూడిక మట్టిని తీసుకోవడం లేదు. దీంతో ఆ మట్టిని మరోప్రాంతానికి తరలించే చర్యలు అధికారులు చేపడుతున్నారు. త్వరలో మట్టి తొలగింపు పనులు జరుగుతాయి.

- శివకుమార్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్

సినీ పరిశ్రమకు వరం మాధవపెద్ది, కోట శ్రీనివాసరావు


కోట శ్రీనివాసరావును సన్మానిస్తున్న అతిథులు

చిక్కడపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విలక్షణమైన గానంతో మాయాబజార్ సినిమాలో వివాహ భోజనంబు పాటను పాడి చిరస్థాయిగా నిలిచిన మాధవపెద్ది సత్యం, ప్రతిఘటన సినిమాతో కాశయ్య పాత్రలో ఒదిగిన కోట శ్రీనివాసరావులు తెలుగు సినీ పరిశ్రమకు వరం అని ప్రముఖులు పేర్కొన్నారు. శ్రీ భారతి ఫౌండేషన్, భారతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో కోట శ్రీనివాసరావుకు శ్రీభారతి ప్రఖ్యాత గాయకుడు మాధవపెద్ది సత్యం పేరిట పురస్కార ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాధవపెద్ది సత్యం కుమారుడు, నాట్యగురువు మాధవపెద్ది మూర్తి మాట్లాడుతూ నటుడు ఎస్వీ రంగారావుకు సత్యం గానం సరిగ్గా కుదిరి ఆయన కీర్తికి దోహదపడిందన్నారు. కోట గొప్ప నటుడు అని పేర్కొన్నారు. పురస్కారం అందుకున్న కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ ధ్వని ఉన్నంత కాలం ఘంటసాల, మాధవపెద్ది సత్యం నిలిచి ఉంటారన్నారు. తెలుగు పద్యం వారి గొంతులోనే వినాలి అన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.కేవీ రమణాచారి అధ్యక్షత వహించిన సభలో సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ పారిశ్రామికవేత్త కృష్ణకిషోర్‌రెడ్డి, రావుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకుడు సురేష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు సంబంధించిన ప్రముఖులకు శ్రీ భారతి ఆత్మీయ, సంగీత పురస్కారాలు బహూకరించారు. తొలుత చింతలపాటి సురేష్ సహగాయకులతో కలిసి పాడిన మాధవపెద్ది పాటలు ఆకట్టుకున్నాయి.

ఆస్పత్రి సమస్యలపై మండలిలో చర్చించండి

ఎమ్మెల్సీ కోదండరాంకు పీవైఎల్, పీవోడబ్ల్యూ నేతల వినతి


కోదండరాంకు వినతిపత్రం ఇస్తున్న పీవోడబ్ల్యూ నేతలు

రాంనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల ఫీజు దోపిడీ, ప్రభుత్వ ఆస్పత్రులలో సమస్యలపై మండలిలో చర్చించాలని ఎమ్మెల్సీ ఎం.కోదండరాంను పీవైఎల్, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు డి.స్వరూప, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్, నాయకులు ఎం.రవికుమార్, లక్ష్మీబాయి, వరలక్ష్మి, బి.ఎస్.కృష్ణలు కలిసి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేట్ ఆస్పత్రుల్లో సర్వేలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. మందుల కొరత తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీ అడ్డూ అదుపు లేదని, వీటిపై అసెంబ్లీలో చర్చించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్సీ ఎం.కోదండరాంను వారు కోరారు.

'అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి'

నల్లకుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారని, ఎగతాళి చేసి అహంకారంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జాతీయ మాలల జేఏసీ ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది ఎస్.ఇ. మహేందర్, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ చైర్మన్ మన్నె శ్రీధర్‌రావు, జై భీమ్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు పి.బల్వంత్‌రావులు అన్నారు. బుధవారం రాత్రి సత్యానగర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. అమిత్‌షా అంబేడ్కర్ పట్ల ఆర్ఎస్ఎస్, బీజేపీకి ఉన్న అవగాహనను వ్యక్తం చేశారని, అట్టడుగు వర్గాల పట్ల వారి వైఖరిని చెప్పారన్నారు. ఎన్నికలకు ముందు అంబేడ్కర్ పేరు జపం చేసి అధికారంలోకి వచ్చాక ఆయన పేరు ఎత్తకూడదని పేర్కొనడం సిగ్గుచేటన్నారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా అమిత్‌షా దిష్టిబొమ్మల దహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మల దహనం నేడు

అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని టీఎస్ ఆర్టీసీ ఎస్సీ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు సుద్దాల సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. కొందరికీ మాత్రమే అంబేడ్కర్ పేరంటే నచ్చకపోవచ్చు కానీ ప్రస్తుతం స్వాతంత్ర్య స్వేచ్ఛావాయువులు పీలుస్తున్న ప్రతి భారతీయుడు ఆరాధించే వ్యక్తి ఆయన అని అన్నారు. ఏ మాత్రం గౌరవం ఉన్న బీసీ నాయకుడుగా చెప్పుకునే ప్రధాని మోదీ సదరు అమిత్‌షాను బర్తరఫ్ చేయాలన్నారు. బుధవారం సాయంత్రం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అగౌరపరచడాన్ని ఖండిస్తున్నామన్నారు.

కార్మికుల సంక్షేమానికి నిరంతర కృషి

వీఎస్టీ యూనియన్ ఎన్నికల కోసం శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్

రాంనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వజీర్ సుల్తాన్ టొబాకో (వీఎస్టీ) కంపెనీ గుర్తింపు కార్మిక సంఘం కోసం ఈ నెల 28న జరిగే ఎన్నికల కోసం నాయిని నర్సింహారెడ్డి గ్రూప్ తరపున యూనియన్ ప్రస్తుత అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తన నామినేషన్‌ను ఎన్నికల అధికారి, కార్మిక శాఖ జిల్లా లేబర్ కమిషనర్ రవీందర్‌రెడ్డికి కార్మికుల పక్షాన నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా ఉదయం బాగ్‌లింగంపల్లిలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయం, విద్యానగర్‌లోని కట్టమైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తన మద్దతుదారులైన కార్మికులతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం పని చేసినందుకు అయిదు పర్యాయాలు కార్మికులు అత్యంత మెజారిటీతో తనను గెలిపించారన్నారు. కార్యక్రమంలో నాయిని నర్సింహరెడ్డి గ్రూప్ నాయకులు ఐలి ప్రభాకర్, బాబి, రవియాదవ్, శంకర్, మధుసూదన్, సత్యనారాయణ, రాములు, శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



● శుభాకాంక్షలు

తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దిల్‌రాజ్‌ను ఆయన చాంబర్‌లో బోయపల్లి లింగంగౌడ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

- గోల్నాక, ఆంధ్రజ్యోతి

ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలి

- వారి పోరాటానికి అండగా ఉంటాం
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కవాడిగూడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న సుమారు 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులను వారివారి విద్యార్హతలను బట్టి జూనియర్ లైన్‌మెన్, సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేటర్‌లుగా కన్వర్షన్ చేయాలని ప్రభుత్వాన్ని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్‌లో భాగంగా ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్యుత్ కార్మికుల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, వారి సమస్యలను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే అసెంబ్లీ సమావేశాల తరువాత సీఎం రేవంత్‌కు లేఖ రాసి, ఆయనను కలిసి విన్నవించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. జేఏసీ చైర్మన్ కె ఈశ్వర్‌రావు, కన్వీనర్ ఎంఏ వజీర్‌లు మాట్లాడుతూ.. ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ ఇచ్చిన తరువాతనే జూనియర్ లైన్‌మెన్, సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో విద్యుత్ సౌధను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో జేఏసీ కో చైర్మన్ చింత ఎల్లయ్య, బి శంకర్, కో కన్వీనర్లు జి నాగరాజు, అరవింద్‌కుమార్, ప్రసాద్, సదానందం, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్స్ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన


కీర్తిని సన్మానిస్తున్న పండిట్ అంజుబాబు

చిక్కడపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం అశోక్‌నగర్‌లోని సత్యనారాయణస్వామి దేవాలయం ఆవరణలో ఉన్న వేదికపై అమెరికా సాండిగో ప్రాంతానికి చెందిన కీర్తి టాడిమేటి భరత నాట్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలు అంశాలకు అనుగుణంగా కీర్తి ప్రదర్శించిన నృత్యాంశాలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో కథక్ కళాక్షేత్ర డైరెక్టర్, ప్రముఖ కథక్‌నాట్యాచార్యులు పండిట్ అంజుబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని కీర్తిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అమెరికాలో ఉంటున్నా మన సాంప్రదాయాలు మరిచిపోకుండా ఈ తరం వారు మన శాస్త్రీయ నృత్యకళను అభ్యసించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అశోక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

21న దివ్యాంగుల రాష్ట్ర స్థాయి ఉత్సవాలు

చిక్కడపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం డిసెంబరు 3ను పురస్కరించుకుని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దివ్యాంగుల రాష్ట్రస్థాయి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పదేళ్లుగా ప్రతీఏటా దివ్యాంగులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సాంస్కృతిక సారథిలో దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించాలని, దివ్యాంగ కళాకారులకు సాంస్కృతిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులు, పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'గొల్ల కురుమలకు అందని ప్రభుత్వ ప్రయోజనాలు'

రాంనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గొల్ల కురుమల ఐక్యతను ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం దెబ్బతీస్తున్నారని భద్రీనాథ్‌యాదవ్ చేసిన ఆరోపణలు అర్థరహితమని గ్రేటర్ హైదరాబాద్ గొల్ల కురుమ సంఘం అధ్యక్షుడు రావుల సుధాకర్ అన్నారు. గొల్ల కురుమల మంచితనాన్ని ఆసరా చేసుకుని తమ వాటాను యాదవులు ఎగరవేసుకుపోతున్నారని ఆరోపించారు. కురుమ, యాదవులు వేర్వేరు అని స్పష్టం చేశారు. కురుమలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ వాటాను ప్రభుత్వం కల్పించాలని కోరారు. బుధవారం బాగ్‌అంబర్‌పేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కురుమలను అడ్డుపెట్టుకుని ఎదుగుతున్న యాదవులు ఇకనైనా తమ తీరును మార్చుకోవాలని లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. రాష్ట్రంలో యాదవుల కంటే కురుమల జనాభా ఎక్కువగా ఉందని రాజకీయ పదవులకోసం యాదవులు తమను వాడుకుంటున్నారని ఆరోపించారు. కురుమలకు అందాల్సిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలను యాదవులు లాక్కుంటూ తమ అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశం కురుమల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామన్నారు. తమ వృత్తి, కులాన్ని అవమానపరిస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

రేపు 'కథల లోగిలి' ఆవిష్కరణ

చిక్కడపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లేఖిని రచయిత్రుల వేదిక సారథ్యంలో లేఖిని రచయిత్రులు సమిష్టిగా ప్రచురించిన కథల లోగిలి ఆవిష్కరణ సభ ఈనెల 20న సాయంత్రం త్యాగరాయగాన సభలో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు ఏ.విజయలక్ష్మి తెలిపారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.కే వీ.రమణాచారి, రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి పుస్తకావిష్కరిస్తారని హాజరుకావాలని కోరారు.

'క్రాస్‌రోడ్ థియేటర్లలో సదుపాయాలు, భద్రత కరువు'

చిక్కడపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సినిమా థియేటర్స్‌లలో కనీస సదుపాయాలు పాటించడంలేదని, భద్రత కూడా లేదని దీని మూలంగా ప్రేక్షకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) డిమాండ్ చేసింది. మంగళవారం, బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య 70 ఎంఎం, సంధ్య 35 ఎంఎం, సుదర్శన్, దేవి తదితర థియేటర్‌లలో పీవైఎల్ సభ్యులు సర్వే నిర్వహించారు. సర్వేలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని సంఘం ప్రతినిధి బృందం తెలిపింది. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కెఎస్ ప్రదీప్ మాట్లాడుతూ సుదర్శన్, దేవి థియేటర్లకు పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. డబ్బులు మాత్రం దండుకుంటున్నారన్నారు. లోపల టాయిలెట్స్ అధ్వానంగా ఉన్నాయని పరిశుభ్రత లేదని, ప్రేక్షకులకు తగ్గ టాయిలెట్స్ లేవని అన్నారు. అలాగే తినుబండారాలు అధిక ధరలకు అమ్ముతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం రవికుమార్, బీఎస్ కృష్ణ, నాయకులు కిరణ్, బంగారి శ్రీనివాస్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భర్త మోసం చేశాడని భార్యకు వేధింపులు

- ఫిర్యాదు చేసినా స్వీకరించని పోలీసులు
- న్యాయం చేయాలని ప్రభుత్వం, అధికారులకు బాధితురాలి వినతి


ముగ్గురు పిల్లలు, భర్త విజయ్‌వంశీ ఫొటోలు చూపిస్తున్న దాసరి రమ్య

నల్లకుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తన భర్త తీసుకున్న డబ్బుల విషయంలో తనను మానసికంగా వేధించడంతోపాటు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినా స్వీకరించని పోలీసులపై చర్యలు తీసుకోవాలని బాధితురాల దాసరి రమ్య రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సికింద్రాబాద్‌కు చెందిన కల్యాణ్‌ను 2009లో ప్రేమ వివాహం చేసుకున్నానని, తనకు ముగ్గురు సంతానమని తెలిపింది. మనస్పర్థల కారణంగా 2020లో కోర్టు నుంచి విడాకులు తీసుకున్నామన్నారు. ఆ తర్వాత వారసిగూడకు చెందిన నంబూరి విజయ్‌వంశీ తాను రైల్వే ఉద్యోగినని, తన పిల్లలను చూసుకుంటానని చెప్పడంతో 2021లో పెద్దల సమక్షంలో ద్వితీయ వివాహం చేసుకున్నట్లు తెలిపారు. వివాహ సమయంలో రూ.10 లక్షలు, 40 తులాల బంగారం కట్నం కింద ఇచ్చినట్లు వివరించింది. వివాహం తర్వాత 3 నెలల నుంచి విజయ్‌వంశీ మద్యం సేవించి అదనపు కట్నం కోసం నిత్యం తనను వేధింపులకు గురిచేశాడని వాపోయింది. ఇంట్లో ఉన్న డబ్బు, బంగారం తీసుకుని తనను పిల్లలను వదిలివేసి వెళ్లిపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు తెలియకుండానే కొంత మందికి ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి వారి నుంచి విజయ్‌వంశీ డబ్బులు తీసుకున్నాడని తెలిపారు. ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో విజయ్‌వంశీపై బాధితులు నవంబర్ 28న చిలకలగూడ, ఈనెల 3న చైతన్యపురి పీఎస్‌లలో ఫిర్యాదు చేశారని తెలిపారు. అయితే ఈ విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని, తనను పోలీసులు మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాల ని ఆమె కోరారు. లేనిపక్షంలో తనకు ఆత్మహత్యే శరణ్యమని కన్నీటిపర్యంతమయ్యారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు

రాంనగర్: రాంనగర్ డివిజన్ ఎస్ఆర్‌టీ కాలనీ సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరుతూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఎస్ఆర్‌టీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయరావు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ నెంబర్ 8 నుంచి 15 వరకు గల ప్రభుత్వ స్థలంపై తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.